క్లుప్తంగా

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో కోరారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులలోని దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకువచ్చి, ఫిజియోథెరపీని చేయించుకోవాలని కోరారు.

మహాప్రాకారానికి విరాళం



ఈఓ రామకృష్ణకు నగదు అందిస్తున్న దాతలు

పాణ్యం: మండలం పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ మహాప్రాకార నిర్మాణానికి దాతలు రూ.లక్ష నగదును అందించారని ఈఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బెంగళూరు నగరానికి చెందిన శ్రీనివాస్ కల్యాణి కుటుంబ సభ్యులు స్వామి వారి ఇంటి ఇలవేల్పు కావడంతో ముక్కుబడిగా రూ.లక్ష నగదును అందించారన్నారు. ఈ నగదును మహాప్రాకార నిర్మాణ కాంట్రాక్టర్ నటరాజన్‌కు అందజేశారు. దాతలకు ఈఓ ప్రత్యేక పూజలు చేయించి, శేషవస్త్రాలతో సన్మానించారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

పాణ్యం: ఆగస్టు 1న ఎంపీపీ ఉస్సేన్‌బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ దస్తగిరి ఆదివారం తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారని, ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఓర్వకల్లు: విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఎద్దుల యజమానికి రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన తిరుపతయ్య కొన్నేళ్ల నుంచి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. ఎద్దులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న సమయంలో శనివారం ఉదయం విద్యుత్ ప్రమాదానికి గురై రెండు ఎద్దులు మృత్యువాతకు గురికావడం బాధకరమన్నారు. ప్రభుత్వం సదరు రైతుకు రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు.

హిందువులు సంఘటితం కావాలి

కర్నూలు కల్చరల్: హిందువులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ అన్నారు. నగర శివారులోని విజ్ఞాన పీఠంలో జరిగిన రెండు రోజుల విశ్వహిందూ పరిషత్ అభ్యాస వర్గ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, నగర అధ్యక్షుడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

కర్నూలు(రూరల్): నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం కర్నూలు జిల్లా సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్‌జట్టును ఎంపిక చేశారు. కోచ్ బ్రహ్మ ఆధ్వర్యంలో పది రోజులు శిక్షణ ఇచ్చి తుది జట్టును ప్రకటిస్తామని ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డుపై గుంతలతో ఇక్కట్లు



గుంతలో బండను ఏర్పాటు చేసిన దృశ్యం

కల్లూరు: అర్బన్ పరిధిలోని మిలటరి క్యాంటీన్, దినెదేవరపాడు గ్రామానికి వెళ్లే దారిలో కర్నూలు అర్బన్ ఐసీడీసీఎస్ కార్యాలయం ముందు రోడ్డు గుంతలు పడి, వర్షం వచ్చినప్పుడు నీరు నిలుస్తోంది. ఈ రోడ్డుపై దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన ప్రయాణికులు, డాక్టర్స్ కాలనీ, పార్థసారథి నగర్, సోమప్ప కాలనీ తదితర కాలనీలకు చెందిన ప్రజలు ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయంలో రోడ్డుపై ఉన్న గుంత కన్పించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు గుంతను గుర్తించడానికి విలుగా బండను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

2న సీపీఐ కార్యవర్గ సమావేశం

కర్నూలు(రూరల్):ఆగస్టు 2వ తేదీన నగరంలోని సీఆర్ భవనంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీష్, ఓబులేష్ హాజరవుతారన్నారు.

పేదల సంక్షేమానికి 'జగనన్న సురక్ష'

- కోడుమూరు నియోజకవర్గంలో 71 సచివాలయాల్లో గ్రామసభలు
- 62,798 మందికి సర్టిఫికెట్లు ఉచితంగా పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మండలాల వారీగా అందించిన సేవలు..

మండలం	మొత్తం సచివాలయాలు	వినతులు	పరిష్కారమైనవి
కోడుమూరు	21	38,453	37,372
గూడూరు	9	7,538	7,256
సి బెళగల్	16	4,436	4,360
కర్నూలు	25	14,590	13,810
మొత్తం	71	65,017	62,798



గొందిపర్ల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారురాలికి ధ్రువపత్రాలను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ (ఫైల్)

కర్నూలు (న్యూటౌన్): గతంలో ప్రజలు ఏ సర్టిఫికెట్ కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. కాళ్ల చెప్పులరిగేలా తిరిగినా పనులు కావడం కష్టతరంగానే ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చారు. 542 రకాల సేవలను సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. అయినప్పటికీ అర్హత ఉండి సాంకేతిక కారణాలతో కొందరు ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని తెలుసుకున్నారు. దీంతో ఆయా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులు కోరిన వెంటనే 11 రకాల సర్టిఫికెట్లను ఇంటి వద్దకే వచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కోడుమూరు నియోజకవర్గంలోని అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేసింది. వలంటీర్లు, అధికారులు ప్రజలకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు శ్రమించారు.

నియోజకవర్గంలో 62,798 మందికి సేవలు...

జగనన్న సురక్ష ద్వారా వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉందని, తమను లబ్ధిదారుల జాబితాలో చేర్చాలని విన్నపాలు వచ్చాయి. ఈ క్రమంలో 71 సచివాలయాల పరిధిలో 71 గ్రామ సభలు నిర్వహించారు. కోడుమూరు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి బెళగల్, కర్నూలు మండలాల్లోని 62,798 మందికి వివిధ రకాల ప్రభుత్వ సేవలను అందజేశారు. కులం, జననం, మరణం, ఆదాయం, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్, మ్యుటేషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. వీటితో పాటు రేషన్, ఆధార్, సీసీఆర్ కార్డులు అందజేశారు. వినతుల్లో 96శాతం ఇప్పటి వరకు పరిష్కరించారు. మిగిలిన వారికి టోకెన్లు జారీ చేశారు. విచారించి సర్టిఫికెట్లు అందజేసేందుకు చర్యలు చేపట్టారు. ఎక్కడికీ వెళ్లకుండా, ఎవరి సిఫార్సులు లేకుండా, పైసా ఖర్చు లేకుండా అవసరమైన పత్రాలు ఇంటి వద్దనే అందించడంతో అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేల మందికి లబ్ధి



జగనన్న సురక్ష కార్యక్రమంలో వేల మందికి లబ్ధి చేకూరుస్తున్నాం. ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకుండా సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా సేవలందిస్తున్నాం. సురక్ష కార్యక్రమం ద్వారా సకాలంలో వేగవంతంగా సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఈ ప్రక్రియ మరిన్ని రోజులు కొనసాగుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలి. – ఆర్ శివరాముడు, తహశీల్దార్ కర్నూలు రూరల్ మండలం

ఇంటి వద్దకే సర్టిఫికెట్



జగనన్న సురక్ష కింద క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వారికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు తీసుకుంటున్నాం. పూర్తిస్థాయిలో విచారించి వారి ఇంటి వద్దకే సర్టిఫికెట్ తీసుకెళ్లి అందిస్తున్నాం. దీంతో ప్రజలు సంతృప్తి చెందుతున్నారు. – కేఏ అజాంఖాన్, ఎంపీడీఓ కర్నూలు

ఒక్కరోజులోనే ఉచితంగా ధ్రువపత్రాలు



ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి ధ్రువపత్రాలకు దరఖాస్తులు స్వీకరించారు. ఒక్కరోజులోనే వేగంగా, సులభంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం అందజేయడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా 15 రోజుల నుంచి 20 రోజుల వరకూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందజేస్తూ మరోవైపు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేయడం అభినందనీయం. –యలమర్తి సువర్ణ, సంతోష్‌నగర్

కార్యక్రమంలో భాగస్వాములవ్వడం సంతోషకరం



వలంటీర్‌గా మా గ్రామంలో 50 ఇళ్లకు సేవలందిస్తున్నా. గతంలో వివిధ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు అనుమతులు లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లు వెంటనే అందిస్తున్నాం. అర్జీదారులు కోరిన వెంటనే సర్వే నిర్వహించి పత్రాలు జారీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించి జారీ చేస్తున్నాం. ఇలాంటి కార్యక్రమంలో మేము సైతం భాగస్వాములు కావడం సంతోషంగా ఉంది. –ముర్తుజాబేగ్, వలంటీర్ (దివ్యాంగుడు), గార్గేయపురం

నేడు 'స్పందన'

గూడూరు: నేడు రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

స్పందనకు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. గైర్హాజరయ్యే అధికారులపై నివేదకలను కలెక్టర్ కార్యాలయానికి పంపించడంతో పాటు ఉన్నతాధికారులకు చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేయడం చేస్తామన్నారు.

గిరిజనులను దెబ్బతీసేందుకు కుట్ర

గడివేముల: దేశంలో గిరిజనులకు దెబ్బతీసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మండిపడ్డారు. ఆదివారం మండల పరిధిలోని ఎల్ కే తండా గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వల్ల ఆదివాసీ గిరిజనులకు ఒరిగిందేమి లేదన్నారు. ఆదిమజాతి (పీవీటీజీ) గిరిజనులకు ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నా ఏ ఒక్కరికి అందడం లేదని విమర్శించారు. ఆదివాసీ ప్రజలకు అడవిపై ఉన్న హక్కులను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసర సరకులు ధరలు పెరిగాయని, గిరిజన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు సక్రమంగా లేవన్నారు. దీని వల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అదేవిధంగా పాడేరు వైద్య కళాశాలలో 75 సీట్లు నిరుపేద మైదాన ప్రాంత గిరిజనులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సాంఘిక నాటకాలను ఆదరించండి





జ్యోతి ప్రజ్వలనతో నాటకాలను ప్రారంభిస్తున్న అతిథులు , అతీతం నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: సామాజిక సమస్యలకు ప్రతిరూపమైన సాంఘిక నాటకాలని ఆదరించాల్సిన అవసరం ఉందని విశ్రాంత ఐఏఎస్, సీనియర్ కళాకారులు గుమ్మళ్ల బలరామయ్య, పడమటి గాలి నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు అన్నారు. నెల నెలా సాంఘిక నాటకాల్లో భాగంగా ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో 'అతీతం' అద్దెపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వంలో 'థ్యాంక్స్ ఫర్ ది పీఎం' నాటకాలను ప్రదర్శించారు. ఈ నాటకాలు ప్రేక్షలను అలరించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కళాకారులకు కొదవ లేదన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాటకాల దర్శకులు, రచయితలు, నటులను సన్మానించారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, ఉపాధ్యక్షుడు ఇనాయతుల్లా, సభ్యులు బాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



శిక్షణ పొందిన విద్యార్థులకు కలర్ బెల్ట్‌లు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు(రూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. ఆదివారం నగరంలోని సీఆర్ భవనంలో శిక్షకుడు షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు కలర్ బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ షబ్బీర్ హుస్సేన్, సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, చిట్టిబాబు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అవసరం



భరతమాత చిత్ర పటం వద్ద ఆరోగ్య భారతి ప్రతినిధులు, అతిథులు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని ఆరోగ్య భారతి జిల్లా కార్యదర్శి బి.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆరోగ్య భారతి అభ్యాస వర్గ కార్యక్రమం బుధవార పేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య వ్యక్తి, ఆరోగ్య కుటుంబం, ఆరోగ్య గ్రామం, ఆరోగ్య దేశం అనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. అనంతరం వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జీజీహెచ్ ఆయుర్వేద వైద్యశాల అధికారి డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి వివరించారు. మన ఆరోగ్యం- గృహ వైద్యం గురించి విశ్రాంత టీబీ అధికారి డాక్టర్ పి.మోక్షేశ్వరుడు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎం. శ్రీధరశర్మ, డాక్టర్ కె.చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, నిర్మల, పి.ఎస్.రావు వివిధ రోగాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య భారతి ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎం.డి.వి.ఎస్.రామశర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్యభారతి మహిళా కార్యదర్శి స్వప్న పార్థసారథి, ఆరోగ్య భారతి సభ్యులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో భాగస్వాములుకండి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ మానవీయ విభాగ్ సంఘ చాలక్ బ్రెంకల నీలకంఠ

కర్నూలు కల్చరల్: దేశ రక్షణలో భాగస్వాములు కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మానవీయ విభాగ్ సంఘ చాలక్ బ్రెంకల నీలకంఠ పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ నగర సాంఘిక్ ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ఆదివారం జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణ జీవితంతో ముందుకు సాగుతూ సమాజ సేవలో పాలు పంచుకోవాలన్నారు బాబా రాందేవ్ పతంజలి యోగా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా ప్రభావరి ఎస్.వి. శివరాజ్, ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి, అన్ని ఉప బస్తీల కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



చిన్నకొట్టాలలో పత్తి పంటలో కలుపు తీస్తున్న కూలీలు



ఒండుట్ల సమీపంలో కళకళలాడుతున్న పత్తి పైరు

కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల తో పంటలకు జీవం పోసినట్లయింది. ముందస్తుగా విత్తుకున్న పత్తి, మొక్కజొన్న, ఆముదం, కంది పంటలు పచ్చగా కళకళలాడుతున్నా యి. అలాగే వ్యవసాయ కూలీలు, రైతులు పంట పొలాల్లో పనులు ముమ్మరంగా చేస్తున్నారు. వర్షాలతో గత కొన్ని రోజులుగా ఇంటి దగ్గర ఉన్న కూలీలకు పని దొరకడంతో ఆనందంగా పొలాలో పనులు చేసుకుంటున్నారు.

గడివేముల: ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ట ప్రాంతాల్లో రైతులు సాగుచేసిన పంటపొలాలు కళకళలాడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గని, ఎల్‌కే తండా, ఒండుట్ల, పైబోగుల గ్రామాలలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ పంటలకు వర్షాలు ఉపయోగకరంగా ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలతో పంటపొలాలు బీడుగా మారాయి. దీంతో పొలం పనుల్లో రైతులు, కూలీలు బిజిబిజీగా మారారు.

సచివాలయ ఏఎన్ఎంలకు ఇతర శాఖల బాధ్యతలొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు వైద్య ఆరోగ్యశాఖ విధులు తప్ప ఇతర ఎలాంటి విధులు అప్పగించకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు సి.క్యాంపు సెంటరులో ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం ఫంక్షన్ హాల్‌లో ఏపీ మెడికల్ ఫెడరేషన్ నిర్వహించిన సమావేశానికి ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంగళ్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఇతర శాఖల పనులు కూడా అప్పగిస్తుండటం వల్ల పని ఒత్తిడి అధికమైందని, 40 యాప్‌లను ప్రతి రోజు అప్‌డేట్ చేయాల్సి ఉందని తెలిపారు. వైద్యారోగ్యశాఖకు చెందిన మెడికల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఆ శాఖకు సంబంధించిన పనులు మాత్రమే నిర్వహించే అవకాశం కల్పిస్తే సేవల్లో నాణ్యత పెరుగుతుందని చెప్పారు. సమావేశంలో జిల్లా ఎన్‌జీఓ నేతలు జవహర్‌లాల్, దస్తగిరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఏపీ మెడికల్ ఫెడరేషన్ చైర్మన్ ఈశ్వరయ్య, కన్వీనర్ చందన, కోశాధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం

కర్నూలు కల్చరల్: త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక్ ఘాట్, స్వామిరెడ్డి నగర్‌లలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం మాట్లాడుతూ త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేషు, వెంకటేశ్వర్లు, ఓబులేష్, అనిల్, ఈశ్వరయ్య, ప్రబోధ, సునీత, లత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

విజేతలకు సన్మానం

కర్నూలు(రూరల్): నగరంలోని కిడ్ వరల్డ్‌లో ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన పార్థసారథి నగర్‌కు చెందిన విద్యార్థులను కాలనీ వాసులు సన్మానించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ పార్క్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కాలనీ వాసులు మాట్లాడుతూ... ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

నైతిక విలువలు పెంపొందించాలి



జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ దేవతా మూర్తులకు హారతి ఇస్తున్న పండితులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామ కృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆయన మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. తర్వాత హరే రామ హరే కృష్ణ సంకీర్తన ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో మూడో రోజు గణపతి పుణ్యాహవచనం, మంటపారాధన, కలశ స్థాపన, శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

9న క్విట్ మోడీ - సేవ్ ఇండియా

కర్నూలు(రూరల్): ఈ నెల 9వ తేదీన క్విట్ మోడీ - సేవ్ ఇండియా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు తెలిపారు. ఆదివారం నగరంలోని కే కే భవనంలో ఆ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతుందన్నారు. ప్రధాన మోడీ నిత్యవసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. ఆయనను గద్దెదించడానికి కార్మిక సంఘాలు కలిసికట్టుగా ఉద్యమాలకు సిద్ధం కావలన్నారు. మోడీని సాగనంపండి – దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈ నెల 9 తేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే క్విట్ మోడీ - సేవ్ ఇండియా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుల గౌస్ దేశాయ్, నిర్మల, నాగేశ్వరమ్మ, ఈరన్న, నారాయణ స్వామి, సాయిబాబా, ఉమాదేవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. జరభద్రం!

- అప్రమత్తంగా ఉండకపోతే విషజ్వరాల బారిన పడే ప్రమాదం
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- నీటి నిల్వ లేకుండా చూసుకోవడంతో దోమల నివారణ



నిల్వ ఉంచిన నీటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య(ఫైల్)

కల్లూరు : వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. సీజనల్ వ్యాధులు ఈ కాలంలో అధికంగా సోకుతుంటాయి. వర్షాకాలంలో వాతావరణ మార్పుల వల్ల, అపరిశుభ్రత వల్ల కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గూన్యా, మెదడు వాపు వ్యాధి, ఫైలేరియా వ్యాధులు ప్రబలే అవకాశముంది. అలాగే నీటి కలుషితము వల్ల వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు వ్యాపిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. ప్రజలకు పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. అవసరమైన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులను ఉచితంగా అందిస్తుంది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఉన్న నీళ్లలో దోమ గుడ్లు పెడుతుంది. దోమలు గుడ్లు పెట్టకుండా ఉండేందుకు ఇంటి పరిసరాల్లో నీళ్లు నిల్వలేకుండా చూసుకోవాలి. దోమ లార్వాలు వృద్ధి చేందకుండా పాత టైర్లలలో, కూలర్లు, వాడిపారవేసిన టైర్లు, కుండలు, చిన్న చిన్న పాత్రలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కాలువలు, గుంతల్లో వేస్ట్ ఆయిల్, దోమల నివారణ మందు చల్లాలి.

ప్రజలకు అవగాహన

ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఆశా కార్యకర్తలు, సచివాలయ ఏఎన్ఎంలులతో పాటు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు, మలేరియా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నీటి నిల్వ ఉండే నీటి డ్రమ్ములు, తొట్లు, గచ్చులులలో నిల్వ ఉన్న నీటిని పారబోసి, శుభ్రపరుస్తున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

దోమల నివారణకు దోమ తెరలను వాడటం, ఇంటికి కిటికీలకు, డోర్లకు, లెట్రిన్ ఔట్‌లెట్ పైపులకు జాలి వేసుకోవాలి. ఇంట్లో సాయంత్రం పూట వేపాకు పొగ బెట్టడం, శరీరమును, చేతులు, కాళ్లు కప్పివుంచే దుస్తులు ధరించాలి. కాచి వడపోసిన శుభ్రమైన నీరు తాగాలి. బయట రోడ్లపై, జంక్ ఆహార పదార్థలకు దూరంగా ఉండాలి. ఇంట్లోనే ఆహారం చేసుకుని వేడివేడిగా తినాలని వైద్యులు సూచిస్తున్నారు. పడుకునే సమయంలో దోమతెరలు వాడాలి.

అవగాహన కల్పిస్తున్నాం



వాతావరణంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ డ్రమ్ముల్లో, గచ్చుల్లో, తొట్లలో నీటి నిల్వలేకుండా చర్యలు తీసుకుంటున్నాం. – భాస్కర్‌రెడ్డి, ఉలిందకొండ పీహెచ్‌సీ, వైద్యాధికారి